# బిజినెస్ రాముడు

వక్కలంక రామారావు

గోధూళి వేళ. అది పట్నం కాబట్టి పక్షులు గూళ్ళకి చేరుకుంటున్నా, వాటిని పట్టించుకునే తీరికా, ఓపికా ఎవరికీ లేవు. పక్షుల గురించి, సంధ్యా సమయం గురించి కావాలనుకుంటే ఇళ్ళలో కూర్చుని, పడుకుని హాయిగా పుస్తకాల్లోనే చదివేసుకుంటున్నారు జనం. ఆలమందలు మేతమేసి ఇళ్ళకు చేరుకోవడం విషయం ఎలా ఉన్నా, కొన్ని ఆవులు లారీమీద కబేళాకు ప్రయాణమై వెడుతున్నాయి. పడమటి దిక్కున కిందికి వాలుతున్న సూర్యుడు మేడలు అడ్డొచ్చి అసలు కనబడటం లేదు.

తమ ఇంటి వీధి గదిలో కూర్చుని తీరిగ్గా ఆ రోజు పేపరు చూస్తున్నాడు శంకరం. ఇంతలో వీధి గేటు దగ్గర స్కూటరు ఆగిన చప్పుడయింది. పేపరు తప్పించి కిటికీలోంచి బయటకు చూశాడు. గేటు తీసుకుని లోపలకు వస్తున్నాడు మధు.

"ఏరా, మధూ! సెకండ్ సాటర్ డే అయినా దొరగారికి మాఇంటికి రావడానికి ఇంతవరకూ తీరిక చిక్కలేదన్నమాట!" అంటూ ఆప్యాయంగా లోపలికి ఆహ్వానించాడు శంకరం.

"అబ్బే అదేం లేదురా! ఈ రోజు సెలవైనా పగలంతా నేనూ, మాఆవిడా ఏవో పుస్తకాలూ, పత్రికలూ చదువుకుంటూ ఇంట్లోనే గడిపేశాం. సాయంకాలం మాఇంటిచుట్టూ ఉన్న ఆడ మలయాళమంతా మాఆవిడ చుట్టూ చేరి ఫస్ట్‌షో సినిమా ప్రోగ్రాం ఏర్పాటు చేశారు."

"అయితే ఇకనేం! నువ్వు కూడా హాయిగా వాళ్ళతో సినిమాకు చెక్కెయ్యకపోయావూ?"

"నీ మొహంలా ఉంది. వాళ్ళు వెళ్ళేది ఏదో గొప్ప మహిళా చిత్రమట. మహిళా చిత్రమంటే మనకి తెలియందేముంది? ఘోరమైన రేప్‌లూ, సంఘాన్ని సంఘంలోని దురాగతాలనీ చాటుతూ హీరోయిన్‌గారి పాట, ఆ పాటతో పెద్ద మార్పు, తిరుగుబాటు... ఇలా రెండున్నర గంటలపాటు ఘోరమైన సుత్తి. అంతేగా! కాకపోయినా అంతమంది ఆడవాళ్ళతో పోతు పేరంటాలిలా నేనొక్కణ్ణీ బయలుదేరడం మాత్రం ఏం బాగుంటుంది చెప్పు? అందుకే మాఆవిణ్ణీ వాళ్ళతో సినిమాకు వెళ్ళి రమ్మని పంపి, ఇంటికి తాళం వేసి నేనిలా చక్కా వచ్చాను. పద, ఇద్దరం కలిసి ఫస్ట్‌షోకి పోదాం. మీ శ్రీమతి ఎలాగూ పుట్టింట్లోనే ఉందిగా?" అన్నాడు మధు.

"సరే దానికేం? ఇంకా టైముంది. వెడదాం. ఇంతకీ ఏ సినిమాకి?"

"వేరే సినిమా ఎందుకు? భారీ తారాగణంతో నిన్ననే విడుదలైన 'బిజినెస్ రాముడు' చూద్దాం, పద. తొందరగా వెళ్ళకపోతే టికెట్లు దొరకవు."

"ఏడిసినట్టే ఉంది నీ పిక్చర్ సెలెక్షన్! ఈ రోజు మధ్యాహ్నం ఏమీ తోచక ఈ బిజినెస్ రాముడు ఆడుతున్న థియేటర్ దగ్గరకు వెళ్ళాను. తీరా చూస్తే థియేటర్ దగ్గర పట్టుమని పదహారుమంది కూడా లేరు. ఏమిటబ్బా! నిన్ననేగదా ఈ బొమ్మ విడుదలవుత! ఒకవేళ సినిమా మొదలైపోయి టికెట్లు దొరకని అభాగ్యులు ఇలా ఆరుబయట తచ్చాడుతున్నారేమోనని ఎంక్వయిరీ ప్రారంభించాను. ఇంకా సినిమా మొదలు



కావడానికి అరగంట టైముందనీ, ఈ సినిమాకు ఇంతకంటే జనం రావడం లేదనీ ఎంక్వయిరీలో బయటపడింది. నిన్న అంటే విడుదలైన రోజున ఉదయం ఆటకు జనం కుప్పలు తిప్పలుగా ఉన్నారట. చాలామందికి టికెట్లు కూడా దొరకలేదుట. మ్యాటినీకి జనం పలచబడ్డారట. ఫస్టుషోకి మరీ తక్కువయ్యారు. సెకండ్ షోకి అంతా కలిపి అరవై మంది కూడా లేరట. అదీ విషయం. రేపు ఆ థియేటర్లో ఈ బొమ్మ తీసేసి మరో బొమ్మ వేస్తారని కూడా చాలామంది చెప్పుకుంటున్నారు."

"ఏమిటీ! 'బిజినెస్ రాముడు' ఇంత ఘోరంగా ఫెయిలయ్యిందా? నేను నమ్మలేకపోతున్నాను. ఇన్ని లక్షలు ఖర్చుచేసి, ఇంత భారీ తారాగణంతో తీసిన సినిమా ఈమధ్య విడుదల కాలేదు. ఇదేదో పెద్ద మిస్టరీలా ఉంది." నిరాశగా అన్నాడు మధు.

"మిస్టరీ మాట దేవు డెరుగు. ఈ 'బిజినెస్ రాముడు' సినిమా వెనుక ఎంతమంది బిజినెస్ చేసి ఎలా బాగుపడ్డారో, ఈ బిజినెస్‌లో ఎవరు ఎలా దివాలా తీశారో చెబుతాను శ్రద్ధగా విను. ఈ కథ వినేముందు కొస్తంత కాఫీ తాగు" అంటూ ఫ్లాస్కులో కాఫీ రెండు కప్పుల్లో పోసి ఓ కప్పు మధుకు అందించి, రెండో కప్పులో కాఫీ తాను సిప్ చేస్తూ కథ ప్రారంభించాడు శంకరం.

"అనగనగా ఓ కుటుంబం. ఆ కుటుంబంలో నలుగురు సభ్యులు. విశేషమేమిటంటే ఆ నలుగురూ రచయితలే! కుటుంబ యజమాని సీతారామయ్య కథలు తయారుచేసి సినిమా వాళ్ళకు సప్లయి చేస్తూ ఉంటారు. ఆయన భార్య జానకీదేవి- కలం పేరు 'జాకీ'. ఆమె రాసిన నవలలు అనేక దిన, వార, పక్ష, మాస పత్రికలలో సీరియల్స్‌గా వచ్చి పాఠకులను అటూ ఇటూ ఊపేశాయి, ఊపేస్తున్నాయి. ఇక వారి అబ్బాయి రాఘవరామారావు గొప్ప కథా రచయిత. 'రా.రా.రా.' కలం పేరుతో అతని కథలు అనేకం పత్రికలలో పడి పాఠకులను ఉక్కిరి బిక్కిరి చేసి ఊపిరాడనివ్వడం లేదు. ఇక వారి అమ్మాయి అలివేలు మినీ కథలు రాయడంలో దిట్ట. 'చిటికెన వేలు' కలం పేరుతో ఆమె ఇప్పటికే మెనీ మెనీ మినీ కథలు రాసి బోల్డు 'జాకెట్‌మనీ' (సారీ! ఆడవాళ్ళ జాకెట్లకు పాకెట్‌లు ఉండవు గనుక పాకెట్‌మనీని జాకెట్‌మనీ అనాల్సొచ్చింది) పోగెట్టింది." తనో సిగరెట్టు వెలిగించి, మధుకి మరో సిగరెట్ ఆఫర్ చేసి మళ్ళీ కథ ప్రారంభించాడు శంకరం.

"ఓ శుక్రవారం శుభముహూర్తాన 'చిటికెన వేలు' పటికబెల్లం ముక్కలాంటి ఒక మినీ కథ రాసింది. కథలో ట్విస్టు భలే తమాషాగా ఉంది. కథను మరోసారి చదివి మురిసిపోతూ, దాన్ని ఏ పత్రికకు పంపించాలా అని ఆలోచిస్తూ కథను కవర్లో పెట్టి, బుగ్గమీద కలం ఆన్చుకుని చిరునామా ఏ పత్రికది రాయడమా అని డైలమాలో ఉండిపోయింది చిటికెన వేలు. ఇంతలో వాళ్ళన్నయ్య రా.రా.రా. వచ్చి "ఏమిటే వేలూ, అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావ్!" అన్నాడు.

"ఏం లేదు అన్నయ్యా! ఈ మినీ కథ చూడు. 'హనీ'లా ఎంత తియ్యగా వచ్చిందో! ఈ కథ చదివి దీన్ని ఏ పత్రికకు పంపితే బాగుంటుందో సలహా చెప్పు." అంది కవరు అన్నగారి చేతికి అందిస్తూ.

రా.రా.రా. కవరులోంచి కథ తీసి గబగబా చదివేశాడు.

"చెల్లాయ్! కథ చాలా బాగా వచ్చింది. నువ్వు మరోలా అనుకోకపోతే నా మాట విని ఈ కథను ఏ పత్రికకూ పంపించొద్దు. అదే నా సలహా!" అన్నాడు.

"బలే బాగుంది. కథ రాసింది ఇంట్లో దాచుకుని పూజించుకోడానికా?" చిరుకోపంతో అంది చిటికెన వేలు.

"దాచుకోమని కాదు, ఈ కథను అమ్మేయ్!"

"అమ్మెయ్యటమా? అదెలా? ఎవరు కొంటారు?"

"ఎవరో ఎందుకు! నేనే కొంటాను. ఈ మినీ కథలోని సెంట్రల్ అయిడియాని కొస్తంత డెవలప్ చేస్తే ఇది మంచి 'కథ' అవుతుంది. ఈ మినీ కథకు ఏ పత్రిక వాళ్ళయినా నీకు మహాఇస్తే పాతిక రూపాయలకంటే పారితోషికం ఇవ్వరు. పోస్టు ఖర్చులు పోతే నీకు పూర్తిగా ఆ పాతికా కూడా ముట్టదు. ఏభై రూపాయలిస్తాను. ఈ కథను నాకు ఇచ్చేయ్. ఈ మినీ కథను నేను పది పేజీల కథగా చేసి పత్రికకు పంపుకుంటాను. సరేనా!' అన్నాడు రా.రా.రా.

"ఓ దానికేం? తీసుకో! మినీ కథలు రాయడానికి నా దగ్గర ఇంకా బోలెడన్ని ప్లాట్లు ఉన్నాయ్!" అంటూ చిటికెన వేలు తన కథను అన్నగారికి అమ్మేసి, అతనిచ్చిన అయిదు పది కాగితాలు జాకెట్‌లో పదిల పరుచుకుంది.

రా.రా.రా. ఆ రోజే కూర్చుని బాగా ఆలోచించి, ఆరు సిగరెట్ పాకెట్లు తగలేసి, ఆ మినీ కథను అటూ ఇటూ సాగదీసి 'కథ'గా చేశాడు: రోజంతా ఇల్లు కదలకుండా కూర్చుని కథను ఫెయిర్ చేసి పత్రికకు పంపడానికి రెడీ చేశాడు. కథకు టైటిల్ మాత్రం ఇంకా నిర్ణయించలేదు. కథకు తగిన నాలుగైదు టైటిల్స్ మనసులో మెదిలాయి గాని ఏదీ అతనికి పూర్తి సంతృప్తిని ఇవ్వలేదు. 'టైటిల్' విషయంలో అమ్మ సలహా అడిగితే బాగుంటుందని 'జాకీ'గారిని కలిశాడు రా.రా.రా.

"ఒరేయ్, రాముడూ! టైటిల్‌కేంగాని కథ మాత్రం చాలా బాగుంది. ఏ పత్రికకు పంపిద్దామనుకుంటున్నావ్?" అంది జాకీ.





"దేనికో దానికి! దేని కయితే ఏంలే! ముందు ఏం పేరు పెడితే బాగుంటుందో చెప్పమ్మా? అది తేలి చావకే నీ దగ్గరకొచ్చాను" అన్నాడు రా.రా.రా.

"ఇంత మంచి కథను కేవలం కథగా ఓ పత్రికకు పంపించి ఆ పత్రిక వాళ్ళిచ్చే ముష్టి వంద రూపాయలు మూట కట్టుకుందా మనుకుంటున్నావా? అదేం బాగులేదు. ఓ పని చెయ్! ఈ కథను నాకిచ్చెయ్! దీన్ని మంచి నవలగా మలచుకుంటాను. నీకు పత్రిక వాళ్ళిచ్చే వంద రూపాయల పారితోషికం బదులుగా రెండొందలు పాకెట్‌మనీ ఇస్తాను. సరేనా!" అంది జాకీ.

"ఓకే! అలాగే చెయ్యమ్మా! తల్లిని మించిన దైవం లేదన్నారు. నీ మాట కాదంటానా? నీ నవలకు నా కథ పనికొస్తుందంటే అంతకంటే మహద్భాగ్యం మరేముంది?" అంటూ తల్లి ఇచ్చిన రెండొందలు జేబులో పెట్టుకుని ఈ వ్యాపారంలో నూటయాభై మిగిలినందుకు సంబరపడిపోతూ డ్రెస్ మార్చుకుని ఈల వేసుకుంటూ వీథిలోకి ఉడాయించాడు రా.రా.రా.

'జాకీ' ఆ కథను రెండుసార్లు శ్రద్ధగా చదివింది. పెద్ద కాగితాల దొంతిని ముందేసుకుని వారం తిరక్కుండా ఆ కథను మరింత సాగదీసి, దాన్నిండా మసాలా దట్టించి, మరికొన్ని పాత్రలు సృష్టించి రెండు వందల పేజీల నవలగా చేసి ఊపిరి పీల్చుకుంది. ఆ నవలను ఓ డైలీకి సీరియల్‌గా పంపబోతూ "ఈ నవల మీద మీ అభిప్రాయం చెప్పండి" అంటూ ఓ రోజు రాత్రి భర్త సీతారామయ్య గారికి చూపించింది.

సీతారామయ్య గారు ఆ కథను ఆ రాత్రంతా కూలంకషంగా చదివి ఆకళింపు చేసుకున్నారు.

మర్నాడు ఉదయం ఆయన "జానీ! రాత్రి నీ నవల పూర్తిగా చదివానోయ్! అద్భుతంగా ఉంది. దీన్ని ఏం చేద్దామనుకుంటున్నావ్?" అన్నారు జానకీదేవి ఇచ్చిన కాఫీ తాగుతూ.

"ఏం చేస్తే బాగుంటుందో మీరే చెప్పండి. ఏదో ఒక డైలీకి సీరియల్‌గా పంపిద్దామనుకుంటున్నాను. ఎలా ఉంటుంది?" అంది జానకీదేవి.

"బాగానే ఉంటుందనుకో! అయినా ఆ డైలీ వాళ్ళు నీకేమాత్రం ఇస్తారు ఈ నవలకు?"

"రెండువేల దాకా ఇవ్వొచ్చు."

"అంతే! రెండు వేలేనా? అయితే ఓ పని చెయ్! దీన్ని నాకు ఇచ్చేయ్! నాలుగు వేలిస్తాను. ఇక ఈ నవలమీద నీకు ఏమాత్రం హక్కులుండవ్! సరేనా!" అన్నారు సీతారామయ్యగారు.

"ఏమిటంటీ! మీరు నా కేమైనా పరాయివాళ్ళా బేరాలాడడానికి! పతియే ప్రత్యక్ష దైవమన్నారు. మీరు అడిగింది ఏనాడైనా కాదన్నానా, మీరు రమ్మంటే ఎక్కడికైనా రానన్నానా?" అంటూ పాత సినిమాలో పల్లవి పాడి ముసిముసిగా నవ్వుకుంటూ మంగళసూత్రాలు కళ్ళ కద్దుకుంద జానకీదేవి.

ఆ రోజే భార్యకు నాలుగు వేలూ ఇచ్చి నవలను తమ సొంతం చేసుకున్నారు సీతారామయ్యగారు.

'రెండొందలకు కొన్న కథకు నాలుగు వేలొచ్చాయంటే మూడు వేల ఎనిమిది వందలు లాభం! పత్రికకు పంపేకంటే ఇదే బాగుంది!' అనుకుంటూ తనలో తనే సంబరపడిపోతూ నాలుగు వేలూ వేనిటీ బాగ్‌లో వేసుకుని ఆటో ఎక్కి పట్టు చీరల షాపుకు బయలుదేరింది జానకీదేవి.

సీతారామయ్యగారు పదిహేను రోజుల పాటు ఇంటిపట్టునే ఉండి ఆ నవలను అటూ ఇటూ కత్తిరించి, కలబోసి, తిరగేసి, రెండు మూడు బూతు హాస్య పాత్రలను కూడా అందులో అదనంగా చొప్పించి, దాన్ని నూటికి నూరుపాళ్ళూ అందమైన ఓ తెలుగు సినిమా కథగా రూపుదిద్దారు. అటుపైన ఆయన తనకు తెలిసిన ఓ ఛోటా ప్రొడ్యూసరు చిదంబరంగారిని కలిసి కథను చదివి వినిపించారు. సినిమాగా తీయడానికి ఆ కథ ఎంత బాగుంటుందో, అందులో కొత్తదనం ఎంతగా ఉందో చిలవలు పలవలు చేసి చక్కగా చెప్పారు. కథ దొరకక వ్యథ చెందుతున్న ప్రొడ్యూసరుగారు ఈ కథ వినగానే వ్యథను విడిచి ముఖం చేటంత చేసుకున్నారు. తక్షణమే పదివేలిచ్చి సీతారామయ్యగారి నుంచి ఆ కథకు సంబంధించిన సర్వహక్కులూ పొంది తమ సొంతం చేసుకున్నారు. ఈ వ్యాపారంలో ఆరు వేలు మిగిలినందుకు ఆనందపడుతూ చిదంబరంగారికి మరోసారి నమస్కారం చేసి మెట్లు దిగారు సీతారామయ్యగారు.

చిదంబరంగారు ఈ కథను 'బిజినెస్ మగ్నెట్' పేరుతో సినిమాగా తీయడానికి రైటర్ దగ్గరనుంచి డైరెక్టర్ వరకూ ఎవరిని పెట్టాలా అని వెతుకుతున్న తరుణంలో ఆయన పాలిటి కల్పవృక్షంలా తగిలాడు అప్పటికే అయిదారు భారీ సినిమాలు తీసి పెద్ద ప్రొడ్యూసర్‌గా పేరొందిన పరాంకుశం. కుశలప్రశ్నల అనంతరం తన సినిమా సంగతి చెప్పాడు చిదంబరం.

"ఏదీ, ముందు కథ వినిపించు. కథ విన్నాక డైలాగ్ రైటర్‌గా ఎవరుంటే బాగుంటుందో, డైరెక్టర్‌గా ఎవర్ని పెడితే బాగుంటుందో నేను చెబుతాను" అన్నాడు పరాంకుశం.

"అయ్యబాబోయ్! మీ నిర్ణయాలన్నీ భారీగా ఉంటాయ్. మీరు నిర్ణయించే భారీ రైటర్‌ని, భారీ డైరెక్టర్ని, భారీ స్టారింగ్‌నీ నేను భరాయించలేను. నా దంతా బహు చిన్న బడ్జెట్. అంతా కలిపి పాతిక లక్షల లోపులో తేలిపోవాలి" అన్నాడు చిదంబరం.

"ముందు కథ వినిపించవోయ్! తరువాత సంగతి చూద్దాం. భయపడకు. నీ వెనుక నేనున్నాగా?" భరోసా ఇచ్చాడు పరాంకుశం.

'ఈ కథ కాస్తా వినేశాక ఇలాంటిదే మరో కథ తయారుచేయించి నాకు దెబ్బకొట్టడు కదా ఈ ముసలిపీనుగ!' అనుకుంటూ అయిష్టంగానే కథ వినిపించాడు చిదంబరం.

"చూడు, చిదంబరం! ఎవరు రాశారో గాని కథ మాత్రం ఫస్టుగా ఉంది. ఈమధ్య మన తెలుగులో ఇంతమంచి సబ్జెక్టును తెర కెక్కించినవాడు ఎవడూ లేడు. అయితే ఒక్క విషయం. ఇంత మంచి కథకు ఎవరో సాదా సీదాగాడిచేత మాటలు రాయించి, సెకండ్‌రేట్ దర్శకుడి చేతిలో పెట్టి, మామూలు మూడో తరగతి నటులతో బొమ్మ తీస్తే ముచ్చటగా మూడ్రోజులు కూడా ఆడి చావదు. ఈ కథకు తగ్గ భారీ సెట్టింగులు, భారీ తారాగణం ఉండి, భారీ దర్శకుడి చేతిలో పెడితే ఈ సినిమాకచ్చితంగా వంద రోజులు నడుస్తుంది. నా మాట విని డబ్బుకి ఆలోచించక తీస్తే పెద్ద బడ్జెట్‌లో తియ్! లేకపోతే పూర్తిగా మానుకో! అంతేగాని చిన్న బడ్జెట్, చిన్న బడ్జెట్ అంటూ చిన్నగా ఆలోచించావా, చివరకు ఏమవుతుందో చెప్పలేం. అనుభవం మీద చెబుతున్నాను. నా మాట విను." అన్నాడు పరాంకుశం.

"అమ్మబాబోయ్! మీరు చెప్పిన లెవెల్లో తీస్తే నా బొమ్మ ఎనిమిది రీళ్ళకే ఆగిపోతుంది. అంత బరువు ఎత్తుకోవడం నావల్ల కాదు" దీనంగా

అన్నాడు చిదంబరం.

"అయితే ఒక పని చెయ్! పాతిక వేలిస్తాను. ఈ కథను నా కొదిలేయ్! నువ్వు నీ పెట్టుబడికి తగ్గస్థాయిలో మరో కథ వెతుక్కో సరేనా!" అన్నాడు వరాంకుశం.

"చిత్తం. చిత్తం. మీ అంతటివారు అడిగితే కాదనగలనా? కాని ఒక్క చిన్నమాట. మీరు మరోలా అనుకోకపోతే మరో అయిదు వేలిప్పించండి. అంతకంటే నేను మరేం కోరను."

"ఓ దానికేం! అలాగే!" అంటూ ముప్పయి వేలకు చిదంబరానికి చెక్కు రాసిచ్చి 'బిజినెస్ మాగ్నెట్'ను తనవరం చేసుకున్నాడు వరాంకుశం.

సినిమా మాట దేవుడెరుగు. ఈ బిజినెస్‌లో ఇరవైవేలు మిగిలాయి అదే పదివేలు అనుకోబోయి, పదివేలకంటే ఇరవైవేలు ఎక్కువని గుర్తొచ్చి, నాలుక్కరుచుకుని, నాలుక తడుపుకోవడానికి టాక్సీమీద బారువైపుగా వెళ్ళిపోయాడు చిదంబరం, చెక్కుతీసి జాగ్రత్తగా జేబులో పెట్టుకుని.

అటుపైన ప్రొడ్యూసర్ వరాంకుశం తన సినిమాకు కూడా బాగా ఎక్కేలా దాని పేరు ఎలా మార్చాలా అని తీవ్రంగా ఆలోచించాడు. రచయితతోనూ, దర్శకుడితోనూ కూడా కూడబలుక్కుని 'బిజినెస్ మాగ్నెట్' పేరు తీసేసి 'బిజినెస్ రాముడు'గా మార్చేశాడు. షూటింగ్ ప్రారంభోత్సవం మొదలు పత్రికల నిండా తమ 'బిజినెస్ రాముడు' వార్తలతో పాటు రకరకాల, రంగురంగుల స్టిల్స్ అధిక సంఖ్యలో వచ్చేలా చేశాడు. సినిమాఇంకా నెల్లాళ్ళకు విడుదలవు తుందనగానే పత్రికల నిండా ఫుల్‌పేజీ ప్రకటనలు గుప్పించాడు. మొత్తం ఆంధ్ర దేశంలోని అన్నలు, తమ్ముళ్ళు, అడపడుచులూ, చిన్నారి పొన్నారి పాపలూ, బాబులూ అంతా 'బిజినెస్ రాముడు' విడుదల కోసం వెయ్యి కళ్ళతో వెర్రెత్తి ఎదురుచూ సేలా చేశాడు.

విడుదలకు ముందు ఆ సినిమా ప్రదర్శన జిల్లాలవారీ హక్కుల కోసం సినిమావ్యాపారులు క్యూలో నిలబడ్డారు. వరాంకుశం మాటల గారడీతో తన సినిమాను అందలం ఎక్కించి, కనీసం ఒక్క రీలైనా చూపించకుండానే బొమ్మను పెట్టెల్లో పెట్టి బేరం నడిపి, జిల్లాల వారీగా అధిక లాభాలకు అమ్మేశాడు. ఈ బిజినెస్‌లో వరాంకుశానికి పెట్టుబడి పోను సుమారు పాతిక లక్షలదాకా మిగిలాయి. లక్షలన్నిటినీ లక్షణంగా బ్యాంకులో వేసి, పడక్కుర్చీలో చిద్విలాసంగా చుట్ట కాలుస్తూ కూర్చున్నాడు వరాంకుశం.

"అయితే ఒక్క విషయం. మిగతా జిల్లాల మాటేమోగాని మన జిల్లాలో ఈ సినిమాహక్కులు కొన్నవాడు సన్యాసిరావు. ముచ్చటగా మూడు లక్షలకు మూడు కాపీలు కొని మూడు పట్టణాల్లో 'ఏ' వన్ థియేటర్లు అద్దెకు తీసుకుని రిలీజ్ చేశాడు. కాని 'బిజినెస్ రాముడు' బిజినెస్ పావం మొదటి రోజునే తుస్సుమంది.

ఈ సినిమా మీద జరిగిన బిజినెస్‌లో చిటికెన వేలు, రా.రా.రా., జానకీదేవి, సీతారామయ్య, చోటా ప్రొడ్యూసరు చిదంబరం, బడా ప్రొడ్యూసరు వరాంకుశం అంతా అంతో ఇంతో లాభం పొందారు. ఇక ఈ 'బిజినెస్ రాముడు'లో నటించిన నటీనటులు, ఇతర సాంకేతిక బృందం ఎవరి పారితోషికం వారు ముందుగానే చేజిక్కించుకున్నారు. ఇక ఈ బిజినెస్‌లో నష్టపోయిందల్లా మన సన్యాసిరావులాంటి సన్నాసు లొక్కరే! ఇదే 'బిజినెస్ రాముడు' వెనుక ఉన్న బిజినెస్ కథ." కథంతా చెప్పి గ్లాసుడు మంచినీళ్ళు తాగాడు శంకరం.

"సినిమా మాట ఎలా ఉన్నా ఈ సినిమా వెనకాల బిజినెస్ కథే ఎంతో బాగుంది. ఇంతకీ ఈ కథంతా నీకెలా తెలును? ఏదైనా సినిమా పత్రికలో వచ్చిందా?" ఆశ్చర్యపోతూ అడిగాడు మధు.

"ఇందులో తెలియడానికి విచిత్రం ఏమీలేదు. ఈ కథలో చిటికెన వేలు నా శ్రీమతి అలివేలు మంగ. ఇకపోతే రా.రా.రా. మాబావమరది రామారావు. జాకీ..."

"ఇక చెప్పక్కర్లేదు. ఆవిడ సాక్షాత్తూ మీ అత్తగారు. అంతా అర్థమైంది. నే వస్తాను" అంటూ గేటువైపు నడిచాడు మధు.

ఇంకా ఏదో చెబుదామని మధు వెనకే పరుగెత్తిన శంకరం దూరమైపోతున్న స్కూటర్‌వైపు అలాగే చూస్తూ ఉండిపోయాడు.

ఇంతకీ ఈ కథలో 'సన్యాసిరావు' ఎవరో తెలునుకోకుండానే వెళ్ళిపోయాడు మధు. "ఆ సన్యాసిరావుని నేనే!" అంటూ జుట్టు పీక్కున్నాడు శంకరం. ●

పెళ్లికి ముందు లిమ్కా
పెళ్లి తర్వాత లిమ్కా



పెళ్లికి ముందు ప్రేమ పాఠాలు వల్లిస్తూ-వల్లిస్తూ అలసినపుడు, పెళ్లయ్యాక సరసం విరసంగా మారితే, బుజ్జగిస్తూ, బతిమాలుకొంటూ అలసినపుడు సూక్ష్మక్రిమి రహిత లిమ్కా త్రాగితే దప్పి, అలసట క్షణాల్లో మాయం! దాహం తీర్చే ఐసోటానిక్ లవణాలు లిమ్కాలో వున్నాయిగా మరి!

Limca
నిమ్మ కాయ నీరులా మజా నివ్వగల పానీయం

ARTIFICIALLY FLAVOURED. CONTAINS NO FRUIT JUICE OR FRUIT PULP.
RADEUS/PE/L/2-87